క్లుప్తంగా

నగరంలో పూడికతీత పనులు



పటమట(విజయవాడతూర్పు): నగరంలో డీసిల్టింగ్ పనులను విస్తృతంగా చేసి, వాన నీటి నిల్వలు రోడ్లపై ఉండకుండా చర్యలు తీసుకోవాలని వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. వీఎంసీ ఇంజినీరింగ్ సిబ్బంది నగరంలో డీసిల్టింగ్ పనులను సోమవారం చేపట్టింది. సర్కిల్–1 పరిధిలో 46వ డివిజన్ ఐరన్ యార్డ్, 44వ డివిజన్ బైపాస్ రోడ్ వెంట ఉన్న డ్రెయిన్‌లో, సర్కిల్–2 పరిధిలో సింగ్‌నగర్ ఫ్లైఓవర్ నుంచి నూజివీడు రోడ్డు, ఇన్నర్ రింగ్‌రోడ్డు ప్రాంతాల్లోని అవుట్‌ఫాల్ డ్రెయిన్లలో, సర్కిల్–3 పరిధిలో గుణదల, ఆటోనగర్ గుంటతిప్ప డ్రెయిన్‌లో సిబ్బంది పూడికతీత పనులు చేశారు.

అలరించిన మిమిక్రీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): దేవీనగర్ శ్రీకోదండ రామాలయం శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవాలలో భాగంగా సోమవారం సాయంత్రం ప్రముఖ టీవీ ఆర్టిస్ట్ మిమిక్రీ శ్రీనివాస్ చేసిన మిమిక్రీ భక్తులను అలరించింది. చక్కటి హావభావాలతో మిమిక్రీ శ్రీనివాస్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రముఖ హీరోల మాదిరిగా చేసిన మిమిక్రీ ఆద్యంతం చూపరులను ఆకట్టుకుంది. బొమ్మతో మాట్లాడిస్తూ ఆయన చేసిన హాస్య ప్రదర్శన ఆహూతులను కడుపుబ్బ నవ్వించాయి. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు శ్రీ కాటూరి వీర్రాజు, గంగిశెట్టి సాంబశివరావు పర్యవేక్షించారు.

కొనసాగుతున్న నవమి పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): సీతారాముల కల్యాణోత్సవాలు సోమవారం రెండో రోజుకు చేరుకున్నాయి. మధురానగర్, ముత్యాలంపాడు, దావు బుచ్చయ్యకాలనీ, దేవీనగర్, మాచవరం తదితర ప్రాంతాలలో ప్రత్యేక పూజలు, అర్చనలు జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు సీతారాములను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. సాయంత్రం సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. దుర్గాపురంలో సీతారాముల కల్యాణోత్సవంలో భాగంగా ఊరేగింపు నిర్వహించారు. దారి పొడవునా మహిళలు, భక్తులు స్వామి అమ్మవార్లకు హారతులు ఇస్తూ స్వాగతం పలికారు.

వ్యాపారిని మోసం చేసిన ముగ్గురిపై కేసు నమోదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మనీష్ మార్కెటింగ్ ఏజెన్సీ వద్ద వస్తువులు కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వకుండా మోసం చేసిన ముగ్గురు వ్యక్తులపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భవానీపురం హెచ్‌బీకాలనీకి చెందిన అంబాలాల్ మనీష్ మార్కెటింగ్ ఏజెన్సీ పేరుతో గ్రైండర్లు, మిక్సీలు వంటి గృహోపకరణాలు వ్యాపారం చేస్తున్నాడు. చిట్టిరెడ్డి రామకృష్ణ, తెప్పలి వెంకట్రావు, తోట ఉమామహేశ్వరరావులు సరుకులు తీసుకెళ్లి డబ్బులు తిరిగి ఇస్తూ ఉంటారు. అలా నమ్మకం కుదిరింది. ఈ నేపథ్యంలో చిట్టిరెడ్డి రామకృష్ణ రూ.80 వేలు, తెప్పలి వెంకట్రావు రూ.2 లక్షలు, తోట ఉమామహేశ్వరరావు రూ.లక్ష విలువైన సరుకు తీసుకెళ్లారు. డబ్బులు చెల్లించాలని అడిగితే వ్యాపారిని బెదిరిస్తున్నారు. దీనిపై ఏజెన్సీ నిర్వాహకుడు అంబాలాల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

వీఆర్ఏలకు ఉద్యోన్నతులు కల్పించాలి

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకులు(వీఆర్ఏ) సమస్యల్ని ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, వారికి ఉద్యోన్నతులు ఇవ్వాలని, వేతనాలను పెంచాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వీఆర్ఏల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.పెద్దన్న అధ్యక్షతన విజయవాడ దాసరిభవన్‌లో సోమవారం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సమావేశంలో ముఖ్య అతిథిగా రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో వీఆర్ఏలు 21 వేల మంది సేవలందిస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విడిపోయాక.. తెలంగాణ రాష్ట్రంలోని వీఆర్ఏల ఉద్యోగాలను క్రమబద్ధీకరించారన్నారని, ఏపీలో మాత్రం జరగలేదన్నారు. చిన్నపాటి ఉద్యోగాలు, చాలీచాలని వేతనాలతో జీవనం గడిపిస్తున్న వీఆర్ఏల ఇచ్చిన డీఏలను వెనక్కి తీసుకోవడం తగదని రామకృష్ణ అన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావుపల్లి రవీంద్రనాథ్, వీఆర్ఏల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.గణేష్‌రావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బాలకాశి, రాష్ట్ర నాయకులు భద్రరావు, వెంకటరత్నం, వివేక్, సురేష్ మాట్లాడారు.

అండర్ పాస్ కష్టాలు తీరేనా ?

- రామకృష్ణాపురం – దేవీనగర్ అండర్‌పాస్‌లో అవస్థలు
- కొద్దిపాటి వర్షానికే అండర్ పాస్ వద్ద నిలుస్తున్న వర్షపునీరు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న స్థానికులు



దేవీనగర్ రైల్వే అండర్ పాస్ వద్ద నిలిచిన వర్షపునీరు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నిత్యం రద్దీగా ఉండే రామకృష్ణాపురం దేవీనగర్ రోడ్డులోని రైల్వేట్రాక్ అండర్‌పాస్ వద్ద కొద్దిపాటి వర్షానికే రోడ్డుపై వర్షపునీరు నిలుస్తోంది. దీంతో రాకపోకలకు వాహన చోదకులు, పాదచారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రైల్వే ట్రాక్ అండర్ పాస్‌కు ఇరువైపులా రోడ్డు విశాలంగా ఉండటంతో వేగంగా వచ్చిన వాహన చోదకులు ఒక్కసారిగా అండర్‌పాస్ వద్ద గుంతల్లో పడిపోతున్నారు. ఇక్కడ రోడ్డును సరిచేయాలని ఎన్నిమార్లు అధికారులకు విన్నవించుకున్నప్పటికీ రైల్వే అధికారులు అనుమతులు ఇవ్వటం లేదంటున్నారని స్థానికులు వాపోతున్నారు. ఇక్కడ వర్షపునీరు నిలిచిపోవటంతో పాటు గుంతలుపడి బురదగా మారటంతో తరచూ వాహన చోదకులు, పాదచారులు జారి పడి గాయాల పాలవుతున్నారు. నిత్యం ఈ మార్గం మీదుగా రామకృష్ణాపురం, దేవీనగర్, జీవీఆర్ నగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్‌లతో పాటు విజయదుర్గానగర్, మధురానగర్, కేఎల్ రావు నగర్, గుణదల తదితర ప్రాంతాలకు చెందిన వారు రాకపోకలు సాగిస్తుంటారు. అంతటి ప్రాధాన్యం కలిగిన ఈ మార్గంలో రోడ్డును సరిచేయకపోవటంతో వాహనాలు తరుచూ మరమ్మతులకు గురవుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అనుమతులు ఇవ్వని రైల్వే అధికారులు

ఇక్కడ అండర్ పాస్ వద్ద రోడ్డు వేసేందుకు రైల్వే అధికారులు అనుమతులు ఇవ్వటం లేదు. నగరపాలకసంస్థ వారు రోడ్డు వేయటానికి ప్రయత్నించినప్పటికీ రైల్వే సిబ్బంది అడ్డుకోవటంతో పాటు వేసిన రోడ్డును తవ్వేస్తున్నారు. ఈ విషయమై గత ప్రభుత్వ హయాంలో అనేక మార్లు రైల్వే అధికారులకు విజ్ఞప్తి చేసినప్పటికీ పనులు చేపట్టలేదు. అప్పటి నగరపాలకసంస్థ కమిషనర్ సైతం ఆగ్రహం వ్యక్తం చేశారు. రైల్వే ట్రాక్ కింద నుంచి వెళ్లే వాటర్ పైపులైన్, యూజీడీ పనులు, మరమ్మతులకు సైతం రైల్వే అధికారులు అనుమతి ఇవ్వకపోవటం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు స్పందించి వేలాది మంది రాకపోకలు సాగించే ఈ మార్గంలో రోడ్డును సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

అధ్వానంగా అండర్‌పాస్ రోడ్డు..



ఇక్కడ అండర్‌పాస్ వద్ద రోడ్డు అధ్వానంగా ఉంది. కొద్దిపాటి వర్షానికే వర్షపునీరు నిలిచిపోయి రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. వర్షపునీరు నిలిచిపోవటంతో పాటు బురదగా మారటం వల్ల తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేయాలి.

– జి.వెంకటేశ్వరరావు, స్థానికుడు, దేవీనగర్

రాకపోకలకు అవస్థలు..



చినుకు పడితే ఈ మార్గంలో రాకపోకలు సాగించాలంటే భయంగా ఉంది. కనీసం ద్విచక్రవాహనం వెళ్లేందుకు సైతం అవస్థలు పడాల్సి వస్తోంది. అలాగే కార్లు వెళ్లేటప్పుడు ఇక్కడ నిలిచిన వర్షపునీరు పక్కన ఉన్నవారి మీద పడుతున్నాయి. బయటకు వెళ్లిన పిల్లలు తిరిగి ఇంటికి వచ్చే వరకు ఆందోళనగా ఉంటుంది.

– జి.మురళీకృష్ణ, వాహన చోదకుడు

గాయత్రి సొసైటీ ఆధ్వర్యంలో సామూహిక ఉపనయనాలు



సామూహిక ఉపనయనాల కార్యక్రమం పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే విష్ణు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక సత్యనారాయణపురంలోని గాయత్రి సొసైటీ ఆధ్వర్యంలో బ్రాహ్మణ బాలురకు సామూహిక ఉపనయనాల కార్యక్రమం గాయత్రి సొసైటీ కల్యాణ మండపంలో సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. వేద పండితులు, ధార్మిక విద్యాధికుల మంత్రోచ్చారణల మధ్య జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ముఖ్య అతిథిగా పాల్గొని వటువులకు ఆశీస్సులు అందజేశారు. భిక్షాటన, యజ్ఞోపవీతం ధరించిన అనంతరం ఆచరించవలసిన నియమాలను వటువులకు వివరించారు.

తల్లిని మించిన దైవం, గాయత్రిని మించిన మంత్రం లేదు : విష్ణు

గురుముఖంగా అగ్ని కార్య సాక్షిగా చెప్పబడే మంత్రమే గాయత్రి మంత్రమని మల్లాది విష్ణు చెప్పారు. పిన్న వయసులో ఉపనయనం జరిగిన వారికి గాయత్రి మాత అనుగ్రహం పుష్కలంగా ఉంటుందన్నారు. నిత్యం గాయత్రి మంత్ర జపం అనేక సత్ఫలితాలనిస్తుందని, త్రికాల సంధ్యావందనం ద్వారా అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయని తెలిపారు. సంప్రదాయాలను, ప్రతి ఒక్క వటువు త్రికాల సంధ్యావందనం, గాయత్రి మంత్రోపాసనం తప్పనిసరిగా ఆచరించాలన్నారు. అప్పుడే వారి జీవన స్థితిగతులు ఉన్నత స్థాయికి చేరుకుంటాయన్నారు. ఈ సందర్భంగా త్రికాల సంధ్యావందన విశిష్టతను వివరించారు. సంధ్యావందనం సమయంలో సూర్య శక్తిని పొందేందుకు మనిషికి ఉన్న శక్తి చాలదు కనుక గాయత్రి మంత్రాన్ని ఉచ్చరించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్క బ్రాహ్మణుడు తన దైనందిన జీవితంలో ఎంత బిజీగా ఉన్నప్పటికీ త్రికాల సంధ్యావందనాన్ని మరువకూడదని తెలిపారు. అలాగే 16 ఏళ్ల వయసులోపే ఉపనయనాలను పూర్తి చేసుకోవాలని బ్రాహ్మణ బాలురకు మల్లాది విష్ణు సూచించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ శర్వాణీ మూర్తి, గాయత్రి సొసైటీ చైర్మన్ గంటి ఈశ్వర్, ట్రెజరర్ జె.కె.సుబ్బారావు, చల్లా హరికుమార్, సనత్, చాంద్ శర్మ, చల్లా సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో శారీరక, మానసిక ప్రశాంతత



సహజయోగ పరిచయ కార్యక్రమంలో పాల్గొన్న ట్రస్ట్ ప్రతినిధులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): సహజ యోగ ధ్యానంతో ప్రతి ఒక్కరూ తమలో వివేకం, విజ్ఞానం, సత్వగుణాలను పెంపొందించుకోవచ్చని, శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఉన్నతి పొందవచ్చని సహజయోగ ట్రస్ట్ నగర కోఆర్డినేటర్లు యర్రంశెట్టి గాంధీ, టి.రవీంద్రబాబు అన్నారు. కృష్ణలంకలో బస్టాండ్ నుంచి వారధి వరకూ పరమ మాతాజీ నిర్మలాదేవి సహజయోగ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం సహజయోగ ప్రచార రథయాత్ర కొనసాగింది. కృష్ణలంక అమరజీవి పొట్టి శ్రీరాములు ఉన్నత పాఠశాలలో వాకర్లకు సహజయోగ పరిచయ కార్యక్రమం నిర్వహించారు. గాంధీ, రవీంద్రబాబు మాట్లాడుతూ కుండలినీ శక్తి సత్యాన్ని అనుభూతిపరంగా మానవాళికి సునాయాసంగా మాతాజీ నిర్మలాదేవి అందించారన్నారు. అనంతరం నవభారత్ ఉన్నత పాఠశాలలో సహజ యోగ ధ్యాన ప్రక్రియలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏలూరు జిల్లా కోఆర్డినేటర్ కె.విజయలక్ష్మి, ప్రచార రథయాత్ర కోఆర్డినేటర్ ఎస్.శంకర్, ట్రస్ట్ మహిళా విభాగం రాష్ట్ర కోఆర్డినేటర్ సుగ్గల సుధారాణి, రథయాత్ర కృష్ణలంక సారధి పురుషోత్తపట్నం విజయలక్ష్మి

సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపండి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ చంద్రశేఖర్

పటమట(విజయవాడతూర్పు): ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చే ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని అందించాలని వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్ ఆదేశించారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కమిషనర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజలు తీసుకొచ్చే ప్రతి సమస్యను అధికారులు సమన్వయంతో పని చేసి పరిష్కరించాలన్నారు. సోమవారం మొత్తం 14 ఫిర్యాదులు అందగా అందులో ప్రధానంగా పట్టణ ప్రణాళిక సంబంధించినవి 8, ఇంజినీరింగ్, రెవెన్యూకు రెండు, ప్రజారోగ్యం, ఉద్యానవనం సంబంధించి 1 ఫిర్యాదు అందాయన్నారు. కార్యక్రమంలో చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, డెప్యూటీ కమిషనర్ రెవెన్యూ జి.సృజన, సూపరింటెండింగ్ ఇంజనీర్లు పి.సత్యనారాయణ, పి సత్యకుమారి, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాల్‌కృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కుస్తీ పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులు



కుస్తీ పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులు

నున్న(విజయవాడరూరల్): తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఈ నెల 5, 6 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల రెజ్లింగ్(కుస్తీ) పోటీల్లో నున్న జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. అండర్ –15, అండర్–20 బాలుర, బాలికల విభాగాల్లో మొత్తం తొమ్మిది విద్యార్థులు పతకాలను సాధించారు. దీంతో రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో ఎన్టీఆర్ జిల్లా రెండో స్థానంలో నిలిచింది. జీ శైలజ, బీ హేమంత్‌సాయితేజ కుస్తీ పోటీల్లో బంగారు పతకాలు సాధించారు. అలాగే టీ స్నేహలత, డీ దీపిక, డీ సంతోష్ రజత పతకాలను కైవసం చేసుకోగా, సీహెచ్ బిందు, టీ వీణా మాధురీ, టీ చిట్టెమ్మ, కే సుశాంత్ కాంస్య పతకాలను సాధించారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన క్రీడాకారులను, శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ టీ శ్రీలతను హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వజ్రాల భూపాల్‌రెడ్డి సోమవారం అభినందించారు.

ధాన్యానికి మద్దతు ధర చెల్లించాలి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

పాయకాపురం(విజయవాడరూరల్): అకాల వర్షం రైతులను కోలుకోలేని దెబ్బ తీసిందని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. కుందావారి కండ్రికలో కల్లాలు, రహదారులపై నిల్వ ఉంచిన ధాన్యాన్ని సోమవారం ఆయన రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే గిట్టుబాటు ధర లేక అల్లాడుతున్న రైతన్నలకు తడిచిన ధాన్యం ఆరబెట్టుందుకు అవుతున్న ఖర్చు తడిచి మోపెడవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షంతో రైతులు తీవ్రంగా నష్ట పోయారని అయినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. ముఖ్యంగా ఉమ్మడి కృష్ణాజిల్లా రైతులకు ప్రభుత్వం నుంచి సరైన భరోసా లభించడం లేదని ఆరోపించారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ప్రభుత్వం చెప్పేది ఒకటి క్షేత్రస్థాయిలో జరుగుతుంది మరొకటని మండిపడ్డారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినప్పటికీ రవాణా వాహనాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. ఓ వైపు ముమ్మరంగా వరి కోతలు సాగుతూ కల్లాలపై ధాన్యం రాసులు, బస్తాలు పేరుకుపోతుంటే రవాణా సదుపాయం లేక రైతన్న తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. మరోవైపు వాతావరణం రైతులను కలవరపెడుతుందన్నారు. రైతులకు మద్దతు ధర చెల్లించాలని డిమాండ్ చేశారు.

అన్నదాతలకు అండగా వైఎస్సార్ సీపీ..

కష్టపడి పండించుకున్న పంట ఏమవుతుందోనంటూ అన్నదాతలు ఆందోళన చెందుతున్నారని విష్ణు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే అదనుగా రూ. 1,740 పలికే 75 కేజీల ఏ గ్రేడ్ ధాన్యాన్ని ప్రైవేటు వ్యక్తులు రూ.1,400 అంత కన్నా తక్కువకు కొంటూ అన్నదాతలను దోచుకుంటున్నారన్నారు. అదే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మార్చిలోనే రబీ ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకున్నామని పైగా తేమ 26 నుంచి 30 శాతం ఉన్నా గత ప్రభుత్వంలో ధాన్యం కొనుగోలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కానీ కూటమి ప్రభుత్వం రైతులను పట్టించుకోకపోవటం బాధాకరమన్నారు. పైకి రైతు ప్రభుత్వమని గొప్పలు చెప్పటం తప్ప ఇప్పటి వరకు వ్యవసాయ,పౌర సరఫరాల అధికారులు కనీసం వచ్చి చూసిన పాపాన పోలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే సంచులు రవాణా వాహనాలు ఏర్పాటు చేయాలని కోరారు. అన్నదాతలను ఇబ్బందులకు గురిచేస్తే వారి పక్షాన వైఎస్సార్ సీపీ అండగా నిలబడతుందన్నారు. ఆయన వెంట నాయకులు యర్రగొర్ల శ్రీరాములు, దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి, దేవిరెడ్డి మంగారెడ్డి, వి.రాము, నల్లమోతు చినబాబు, పామర్తి వెంకయ్య, ఎం. రవీంద్రరెడ్డి, మేడా రమేష్, జాజుల నాగేశ్వరరావు, రైతులు ఉన్నారు.

మధురానగర్‌లో చెత్త తొలగింపు



చెత్తచెదారం తొలగించిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎట్టకేలకు విజయవాడ నగరపాలకసంస్థ అధికారులు స్పందించారు. మధురానగర్ రైల్వే స్టేషన్ రోడ్డులో పేరుకుపోయిన చెత్తచెదారాన్ని వీఎంసీ పారిశుద్ధ్య సిబ్బంది తొలగించారు. ఇక్కడ సర్వీసు రోడ్డులో చెత్తచెదారం పేరుకుపోవటంతో పాటు స్థానికులు చెత్తచెదారాన్ని పడవేశారు. దీంతో స్థానికులు పడుతున్న అవస్థలను వివరిస్తూ సర్వీస్ రోడ్డా.. డంపింగ్ కేంద్రమా అనే శీర్షికన సాక్షి దినపత్రికలో కథనం ప్రచురించితమైంది. దీనిపై స్పందించిన అధికారులు చెత్తచెదారం తొలగించారు. అలాగే రామకోటి మైదానం సమీపంలో రోడ్డుపై పేరుకుపోయిన చెట్ల కొమ్మలను తొలగించారు. స్పందించిన అధికారులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన వసంత నవరాత్రి ఉత్సవాలు



శ్రీ శివకామేశ్వరీ అమ్మవారు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వసంత నవరాత్రి ఉత్సవాలు సోమవారంతో వైభవంగా ముగిశాయి. ముత్యాలంపాడులోని శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారి దేవాలయంలో భక్తులు అమ్మవారికి సారె సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి 1008 ముత్తయిదువులకు చీర, పసుపు, కుంకుమ, గాజులు పంపిణీ చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు డీవీఎస్ రాజు, డి.శివరామరాజు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.




ఆలయంలో సారె సమర్పిస్తున్న భక్తులు

శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో..

శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో సోమవారం శ్రీ ధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యాన అమ్మవారికి సోమవారం ప్రత్యేక పూజలు, అర్చనలు జరిగాయి. అలాగే అమ్మవారికి విశేషంగా వస్త్రాలతో అర్చనలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

• నగరంలో వర్షం







కొన్ని రోజులుగా ఎండ వేడిమితో అల్లాడిపోతున్న ప్రజలకు నగరంలో కురిసిన వర్షం ఉపశమనమిచ్చింది. సోమవారం సాయంత్రం నుంచి గాలి, ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. దీంతో పల్లం ప్రాంతాలు నీట మునిగాయి. కార్యాలయాలు వదిలే సమయం కావడం .. భారీ వర్షం పడటంతో వాహనచోదకులు అవస్థ పడ్డారు. అయితే కురిసిన వానకు వేసవి తాపం కొంత వరకు తగ్గిందని చెప్పొచ్చు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

పేద ముస్లిం కుటుంబానికి ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న నాగుల్‌మీరా తదితరులు

పాయకాపురం(విజయవాడరూరల్): ఆజాద్ ముస్లిం కమిటీ సేవా కార్యక్రమాల్లో భాగంగా సోమవారం కండ్రికలో కంచికచర్ల ప్రాంతానికి చెందిన హలీమా కుమార్తె వివాహానికి 15 వేల రూపాయల ఆర్థికసాయం అందజేశారు. కమిటీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి షక్ సమీనా ఫాతిమా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం చెప్పిన ప్రకారం ఆడపిల్లను పెంచి వివాహం చేసిన తల్లిదండ్రులకు పరలోక ప్రభువైన అల్లాహుతాలా స్వర్గప్రాప్తి చేస్తారన్నారు. ఆజాద్ ముస్లిం కమిటీ కులమతాలకు అతీతంగా సహాయం కోరి వచ్చిన వారికి సాయం చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మౌలానా షేక్ సాజిద్ అలీ, ఉపాధ్యక్షుడు ఎండీ కాలేషా, సిటీ అధ్యక్షుడు సిలార్‌బేగ్, 64వ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎండీ ఆరిఫ్, సహాయ కార్యదర్శి ఎండీ జానీ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు పన్ను చెల్లించండి.. రిబేటు పొందండి

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థకు 2025–2026 సంవత్సరానికి ముందస్తుగా ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్ను చెల్లించి ఐదు శాతం రాయితీని పొందవచ్చని డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి.సృజన సోమవారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 2025–2026 సంవత్సరానికి ఇంటి పన్ను, ఖాళీ స్థలాల పన్నులపై ఐదు శాతం రాయితీ కల్పించిందని పేర్కొన్నారు. ప్రజల సౌకర్యార్థం నగర పరిధిలోని మూడు సర్కిళ్లలో ఉన్న క్యాష్ కౌంటర్లతోపాటు డివిజన్లలో ఉన్న సచివాలయాల్లో కూడా పన్నులు చెల్లించవచ్చని తెలిపారు.

ఎన్టీఆర్ వైద్య సేవలు నిలిపివేయటం దురదృష్టకరం

మధురానగర్(విజయవాడసెంట్రల్): నెట్‌వర్క్ ఆస్పత్రులు ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా అందించే చికిత్సలను నిలిపివేయటం దురదృష్టకరమని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా వైద్య విభాగం అధ్యక్షుడు డాక్టర్ అంబటి నాగ రాధాకృష్ణయాదవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ అనాలోచిత విధానాల వల్ల నాణ్యమైన ఖరీదైన వైద్యానికి దూరమవుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వైద్య సేవలను పునరుద్ధరించనట్లయితే ప్రతి రోజు వందలాది మంది పేద, మధ్యతరగతి ప్రాణాలు గాలిలో కలిసిపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం మానవీయ కోణంలో ఆలోచించి తక్షణం బకాయి పడ్డ మొత్తాన్ని నెట్‌వర్క్ ఆస్పత్రులకు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.